ప్రజాశక్తి
శుక్రవారం 19 సెప్టెంబర్ 2025
5
కర్నూలు





ఉల్లి వేలం పాటను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జీ కలెక్టర్ నవ్య

ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలి

• నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి • ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్ రావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి, ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలని ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్ రావు అధికారులకు , ఉద్యోగులకు సూచించారు. కర్నూలు నగర శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యుత్ శాఖ అన్ని స్థాయి ఉద్యోగులకు ఎపిఎస్‌పిడిసిఎల్ కర్నూలు సర్కిల్ ఎస్ఇ ఉమాపతి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విద్యుత్ శాఖపై సానుకూల ప్రజాభిప్రాయం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎపిఎస్‌పిడిసిల్ సిఎండి కె.సంతోష్‌రావు, డైరెక్టర్ టెక్నికల్ ఎపిఎస్‌పిడిసిఎల్ కె. గురువయ్య మాట్లాడారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులతో ముఖ్యంగా చేపట్టే అంశాలలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుతుందా , సరైన ఓల్టేజ్ తో విద్యుత్ అందుతుందా, విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా? ఈ విషయాలపై సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. వీటి కోసమే మొదటి రెండు వాటి గురించి సంస్థ మేనేజ్‌మెంట్ అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమైన మూడో విషయం విద్యుత్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖలో ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందన్నారు. లైన్ మాన్ ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు నిరంతరమైన విద్యుత్ పంపిణీ చేయాలన్నారు. విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులకు సంక్షేమ అభివృద్ధి బాధ్యత మేనేజ్మెంట్‌దని, ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తూ వారికి అందుబాటులో ఉండాల్సిన బాధ్యత మీదని గుర్తించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారుల సమిష్టి కృషి, సమన్వయంతోనే ప్రజలకు 24 గంటలు అంతరాయం లేని విద్యుత్తును అందించి సంతృప్తి స్థాయిని పెంచి సంస్థకు మంచిపేరు తేవాలని తెలిపారు. పిఎం సూర్యఘర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి లక్ష్యాలను చేరాలన్నారు. భారత ప్రభుత్వ స్కీమైన ఆర్‌డిఎస్ఎస్‌ను పూర్తిగా ఉపయోగించుకొని ప్రతి పల్లెకు 24 గంటల త్రీఫేస్ సరఫరా పనులను ముగించుకోవాలన్నారు. తద్వారా మెరుగైన జీవితం వినియోగదారులకు కల్పించడంలో ముఖ్యపాత్ర పోషించి సంస్థాభివృద్ధికి పాటుపడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎటువంటి వారిని కూడా ఉపేక్షించేది లేదని శాఖ పరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడనని తెలిపారు. కర్నూలు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు , సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్లు, లైనింగ్ ఇన్‌స్పెక్టర్లు, అన్ని స్థాయిల ఉద్యోగులు, మీటర్ రీడర్లు కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఎమ్‌డి సంతోష్‌రావు

ఉల్లి క్వింటాకు రూ.50

• ఉల్లి నిల్వల వేలం పాటను ఇన్‌ఛార్జీ కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి వేలంపాటను ఇన్‌ఛార్జి కలెక్టర్ డాక్టర్ బి నవ్య గురువారం పరిశీలించారు. మార్క్ ఫెడ్ వారు కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలకు బహిరంగ వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు పాల్గొని 4905.45 క్వింటాళ్ళ ఉల్లిగడ్డలను కొనుగోలు చేశారు. 1818.00 క్వింటాళ్ళ ఉల్లిగడ్డలకు ఎవ్వరూ వేలం పాడలేదు. బహిరంగ వేలంలో రూ.50 రూ.400 వరకు ధర పలికింది. మార్క్ ఫెడ్ వారు, కొనుగోలుదారులు కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు ఎక్కువగా ఉన్నందున 19న మార్కెట్‌లో ఉల్లికొనుగోళ్లు నిర్వహించడం లేదని ఇన్‌చార్జి కలెక్టర్ ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 1,200 క్వింటాలు ధర కర్నూలు , నంద్యాల జిల్లాలో పండించిన రైతులు మార్కెట్‌కు తెచ్చే సమయములో ఈ-పంట నమోదు, ఒరిజనల్ సర్టిఫికేట్ ఉంటేనే మార్కెట్‌కు తీసుకురావాలని మార్కెట్ యార్డ్ ఎంపిక చేసిన కార్యదర్శి ఆర్ జయలక్ష్మి తులిపారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ, కర్నూలులో ఉల్లిగడ్డల రైతులకు మధ్యాహ్నం , రాత్రి భోజన సౌకర్యం కల్పించాలమని తెలిపారు. ఉల్లిని కోసిన తరువాత ఆరబెట్టుకొని గ్రేడింగ్ చేసుకొని మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. ఈ-పంట నమోదు ఒరిజనల్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్ పుస్తకం జిరాక్సు కాపీలు తీసుకురావాలన్నారు.

నూతన కోర్టు భవనం కోసం స్థలం పరిశీలన

ప్రజాశక్తి-పత్తికొండ

పట్టణంలోని నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవనానికి నిర్మాణానికి స్థలంను గురువారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి, డిఎల్ఎస్ సెక్రెటరీ లీలా వెంకట శేషాద్రి పరిశీలించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ వీలైనంత త్వరగా పత్తికొండ నూతన కోర్టు భవన నిర్మాణం చేయించడానికి కృషి చేస్తానని అన్నారు. పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి టి.జోష్నాదేవి , ఆర్‌డిఒ భరత్ నాయక్, ఎమ్మార్వో హుస్సేన్ సాహెబ్ ,న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై.మధుబాబు, పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

'చలో మెడికల్ కళాశాల'లో ఉద్రిక్తత

- విద్యార్థులపై పోలీసుల దాడి - విద్యార్థి నాయకులపై విరిగిన లాఠీ, పిడిగుద్దులు - ఎస్ఎఫ్ఐ నాయకులపై కేసు నమోదు

వార్త మెయిన్‌లో

ఆదోని సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటీకరణ చేయరాదని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో మెడికల్ కళాశాల'లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. విద్యార్థులు మెడికల్ కళాశాల లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి కార్యకర్తలను లోపలికి పంపారని, తమనెందుకు పంపడం లేదని విద్యార్థి నాయకులు ప్రశ్నించారు. పోలీసులకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులకు, విద్యార్థులకు మధ్య మాటామాటా పెరిగింది. ఎలాంటి హెచ్చరికలూ లేకుండానే పోలీసులు విద్యార్థులపై లాఠీచార్జీ చేశారు.

అధికార పార్టీ మెప్పు కోసమే..!

విద్యార్థులపై దాడి హేయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేదలకు, అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్య దక్కడం కోసం విద్యార్థులు తమ ఘోషను వెళ్ళబోసుకుంటే, అధికారపార్టీ మెప్పు కోసం పోలీసులు హైరానా చేస్తూ విద్యార్థులపై దాడి చేయడం హెయమైన చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి తెలిపారు. గురువారం కర్నూలు సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎండి ఆనంద్ బాబు, కె. వెంకటేశ్వర్లు, ఎండి. అంజిబాబు తో కలిసి మాట్లాడారు.పోలీసులు వెంటనే బేషరతు గా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలన్నారు. విద్యకోసం విద్యార్థులు వెళితే, రాజకీయం కోసం వచ్చిన టిడిపి నాయకుల మెప్పు కోసం విద్యార్థులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టుకు ఖండన

ఆదోని మెడికల్ కాలేజ్ ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేస్తుంటే వాళ్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజ్ లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ పేరుతో మెడికల్ కాలేజ్‌లను ప్రైవేటు వాళ్ళ కు అప్పచెప్పేందుకు కంకణం కట్టుకుందని విమర్శించారు. దానివల్ల పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులు వైద్య విద్యను దూరం కావడానికి అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని మెడికల్ కాలేజ్ ప్రైవేట్ వాళ్ల చేతిలోకి పోతే ఆదోని ,మంత్రాలయం, ఎమ్మిగనూరు ,ఆలూరు, పత్తికొండ తదితర నియోజకవర్గ ప్రజలు మెరుగైన వైద్యం అందకుండా పోయే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. దానికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు అత్యుత్సాహంతో విద్యార్థి సంఘం నాయకుల పైన దాడి చేయడం సరికాదన్నారు. లాఠీచార్జి చేయడన్నీ తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

వేధింపులు ఆపకుంటే ఐక్య ఉద్యమం

• ఆర్‌పిలకు రూ.26 వేల వేతనమివ్వాలి • ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్‌పిలపై రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు ఆపకుంటే పక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల సూచించారు. ఆర్‌పిలకు కనీస వేతనం రూ.26,000 ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్‌పిల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం మూడవ నగర మహాసభ గురువారం కార్మికకర్షక భవన్‌లో సంఘం జిల్లా నాయకురాలు ఎస్.శ్యామల అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల ,జిల్లా నాయకులు సాయిబాబా మాట్లాడారు. ఆర్‌పిలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అర్‌పిలపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఆర్‌పిల సంఘం ఏర్పడినప్పటి నుంచి 40 సంవత్సరాల వయోపరిమితి, మూడు సంవత్సరాల కాల పరిమితి సాధించారని వారు తెలిపారు. ఆర్పిలకు ఎటువంటి సమస్య వచ్చిన సిఐటియు వెంట ఉండి నడుస్తుందని, భవిష్యత్తులో కూడా ఆర్‌పిల సాధించుకోవాల్సిన హక్కులు ఇంకా ఉన్నాయని వాటికోసం ఐక్య పోరాటాలు చేయాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే ఆర్‌పిలు ఐక్యమై పోరాటాలకు ముందుకు రావాలని కోరారు. అనేక చోట్ల అవమానాలతో, అనారోగ్యాలతో బాధపడుతున్న ఈ ప్రభుత్వాలు ఏమి పట్టించుకోవడం లేదన్నారు. సంఘం ఏర్పాటు చేసుకోవడానికి కూడా చాలామంది అధికారులు, రాజకీయ నాయకులు ఆటంకాలు సృష్టిస్తున్నారని తెలిపారు. నగర మహాసభ సందర్భంగా 15మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కార్యదర్శిగా ఎస్.షబాన, అధ్యక్షురాలుగా లక్ష్మీబాయిని ఎన్నుకున్నారు.



మహాసభనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్‌డి.అంజిబాబు





విద్యుల్ బిల్లులు తగ్గించాలని చేనేత కార్మికుల నిరసన

చేనేతకు విద్యుత్ బిల్లుల మోత

ప్రజాశక్తి- కోడుమూరు

చేనేత కార్మికులపై విద్యుత్ భారం పడుతుందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుగుడే మాధవస్వామి, జిల్లా కార్యదర్శి ఎస్ మహబూబ్ బాషా మాట్లాడుతూ కార్మికులకు ఆగస్టు ఏడో తారీఖు చేనేత దినోత్సవం సందర్భంగా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు నేటి నుండి 200 ఉచిత విద్యుత్తు అమలులోకి వస్తుందని చెప్పారన్నారు. ఆ బిల్లు ఇప్పటివరకు రాలేదని, చేనేత కార్మికులు బిల్లులు కట్టలేక లబోదిబోమంటున్నారు. చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయన యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా లో ఈ నెల 24, 25 తారీకుల్లో పర్యటించనుందన్నారు. చేనేత కార్మికుల సమస్యలపై వారితో మాట్లాడి వారి సమస్యల పట్ల అధ్యయన యాత్ర కొనసాగు తుందని వెల్లడించారు. గౌస్, విజయసాయి, శ్రీరాము, గోపి, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు

కవిసమ్మేళనాలతో భాషాభివృద్ధి

-ఇంచార్జి విసి పి.ఎస్.షా వలీ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ప్రాచీన భాషల అభివృద్ధికి కవి సమ్మేళనాలు ఎంతో దోహదపడుతాయని ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పిఎస్.షా వలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం కర్నూలు నగరంలోని అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఉర్దూ శాఖ , ఎన్‌సిపియుఎల్ (నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్) ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి వర్సిటీ ఇంచార్జి విసి పిఎస్.షా వలీ ఖాన్ మాట్లాడారు. ఉర్దూ భాషాభివృద్ధి కోసం కవి సమ్మేళనాలు, సెమినార్లు ఎంతో దోహదపడుతాయని అన్నారు. ఎన్‌సిపియుఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎండి. షంసు ఇక్బాల్ మాట్లాడుతూ ఉర్దూ భాషా వాడుక భాషల్లో ఒక మాధ్యమంగా పని చేస్తుందన్నారు. లతీఫ్ లౌబాలి దర్గా పిఠాధిపతులు సయ్యద్ షా అబ్దుల్లా హుస్సేని బాద్షా ఖాద్రి ,యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ డాక్టర్ సైయ్యద్ ఆరిఫ్ పాషా ఖాద్రి మాట్లాదారు. ఎన్‌సిపియుఎల్ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అతిధులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, కన్వీనర్ డాక్టర్ ఎస్ఎస్ఎం. హుస్సేని, కో-కన్వీనర్లు డాక్టర్ జెఎండి. షఫీ, డాక్టర్ కె. అమతుర్ రహీం, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ఉర్దూ ప్రేమికులు, పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. యుపిహెచ్‌సి పరిధిలోని బాబా బృందావననగర్‌లో జరుగుచున్న ఎన్‌సిడి 4 సర్వేను అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మారిన ఈ జీవన విధానం కారణంగా వస్తున్న ప్రధాన సమస్య అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించాలని సిబ్బందికి తెలిపారు. సర్వే అసంక్రమణ వ్యాధుల నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ పక్కగా నిర్వహించి అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం వలన ఈ వ్యాధిబారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని అన్నారు. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రించవచ్చునని అన్నారు. కేన్సర్ పట్ల చిన్నపాటి లక్షణాలు కనిపించినా వెంటనే స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళ, గురువారం ఓపి నంబర్ 222కు రేఫర్ చేయాలని తెలిపారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ ఆరోగ్య కార్యకర్త వెన్నెల,ఆషా కవిత ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

పర్ల గ్రామంలో: నాగులపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పర్ల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్, మహేశ్వర ప్రసాద్ పరిశీలించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ కొన్ని రకాల వ్యాధులు రాకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోక తప్పదని , షుగర్ రావడానికి ప్రధాన కారణం వంశ పారపర్యంగా లేదా మానసిక వత్తిడి, వృత్తిపరమైన వత్తిడి, తరచూ జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం లేకపోవడ, శారీరక శ్రమ చేయలేక పోవడం, పొగాకు, మద్యం అలవాట్లు, షుగర్, రక్తపోటు వ్యాధులు వచ్చేందుకు ప్రధాన కారణాలు. ఆరోగ్య స్థితి, శారీరక పరిస్థితులకు అనుగుణంగా ఆహార అలవాట్లు, పనితీరు, ఆలోచన విధానాలు మార్చుకోవాలి, మన ఆరోగ్యం మన చేతుల్లో అనేది అందరూ గుర్తించుకోవాలి అన్నారు. వైద్యులు శ్రీదేవి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ , పర్యవేక్షకులు ధర్మశేఖర్, సామాజిక ఆరోగ్య అధికారి అరుణజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు రజని, సునీత, ఆషా కార్యకర్తలు ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.




వైద్యులకు సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

డిఎంహెచ్ఒ ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ కేంద్రంలో గల 24 గంటల వైద్య సేవల ఆసుపత్రిని జిల్లా వైద్యధికారిణి శాంతికళ గురువారం తూతూ మంత్రంగా తనిఖీ చేపట్టారు. కాన్పుల గదిని, రక్త పరీక్షల గదిని, గర్భిణీ వార్డును అంతా కలిపి ఒక్క నిమిషంలోనే పరిశీలన చేసి ఆ వెంటనే వైద్యధికారి మిథున్ రెడ్డిగదిలో మలేరియా వైద్యులు నూకరాజు సమక్షంలో సిబ్బందితో సమీక్షించారు. మండలంలో డెంగీ లక్షణాలు అధికంగా కన్పిస్తున్నాయని తనిఖీకి గల కారణాలు మీడియాకు ఒక్క మాటలోనే చెప్పి సిబ్బందితోనే మాటల్లోకి వెళ్లారు. అక్కడ 24 గంటల ఆసుపత్రి వేళలు పాటిస్తున్నారా? తగిన మందులు స్టాకు గాని, సిబ్బంది సేవలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్న పాపాన పోలేదు. రోగుల ఒపి రికార్డును, రక్త పరీక్షల రికార్డులను, ఆందోళన కర ప్రజారోగ్య స్థితి గతులపై కనీసం ప్రాథమిక వివరాలు అడగక పోవడం, చెప్పక పోవడం తనిఖీ ఏంటని చర్చనియాంషంగా మారింది. అసలు 24 గంటల ఆసుపత్రి కేవలం నాలుగు గంటలు మాత్రమే పని చేస్తుంది.. అందులో ఒక గంట భోజనం వేళ.. పోతే మూడు గంటలే విధులు నిర్వహిస్తూ రూ.వేలల్లో వేతనాలు ఎలా తీసుకుంటారో, ఎలా ఉత్తమ అవార్డులు అందుకుంటున్నారో ఇలాంటి అధికారులు ఉండబట్టేనని అనుకుంటున్నారు.





సబ్‌రిజిస్టార్‌కు వినతిపత్రం ఇస్తున్న దస్తావేజు లేఖరులు

రిజిస్ట్రేషన్ 2.0 విధానం రద్దు చేయాలి

- దస్తావేజు లేఖరులు డిమాండ్

ప్రజాశక్తి - కోడుమూరు

రిజిస్ట్రేషన్ శాఖలో కార్డు ప్రైమ్ 2.0 నూతన సాఫ్ట్‌వేర్ అమలులోకి రావడంతో ప్రజలకు, దస్తావేజు లేఖరులకు నష్టం జరుగుతోందని దస్తావేజు లేఖరులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో రైటర్ల మనుగడ ప్రశ్నార్ధకమవుతుందని వారు గురువారం సబ్ రిజిస్ట్రార్ తేజస్వినికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా మ్యుటేషన్ సిస్టం చాలా మంచిదేనని, డిపార్టుమెంటులో సమస్యల లోపం వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయన్నారు. పిడిఇ విధానానికి మేము వ్యతిరేకం కాదని అందలి లోపాలు సరిదిద్దాలని కోరుతున్నామని తెలిపారు. ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకుగాను కర్నూలు జిల్లా వ్యాప్తంగా వరుసగా రెండు రోజులు ఆందోళన చేస్తున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. స్థానిక దస్తావేజు లేఖరులు రాజశేఖర్, నాగరాజు, సోమశేఖరు, జకె వి నరసింహారావు, భజనహల్ వేణుగోపాల్, అఖిల్, శ్రీరాములు అబ్దుల్లా, తిప్పస్వామి, సురేష్, షఫీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పిఎస్.రాధాకృష్ణ

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

-కలెక్టరేట్ ఎదుట ఎపి గామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ధర్నా


ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఎపి గ్రామ పంచయితి వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పిఎస్.రాధాకృష్ణ యూనియన్ జిల్లా కార్యదర్శి బతకన్న మాట్లాడుతూ పంచాయతి వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. జీవో నెంబర్ 680, 14 అమలు చే యాలన్నారు. టెండర్ పద్ధతి ఎత్తివేయాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులను ఆపాలని డిమాండు చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

సేవలకు లంచం ఇవ్వాల్సిందేనా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ సేవలు పొందాలంటే లంచం ఇవ్వాల్సిందేనా సిపిఎం నగర కార్యవర్గ సభ్యులు విజయ రామాంజనేయులు కమిషనర్‌ను ప్రశ్నించారు. గురువారం సిపిఎం నగర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు బాధితలతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 17వ వార్డు జోహారాపురం 40 సచివాలయం అడ్మిన్ ఇంటి పన్ను వేయాలంటే కూలిపని చేసుకునే వారికి రూ.5వేలు, మధ్యతరగతి ప్రజలకు రూ.10,000 ఇస్తేనే ఇంటి పన్ను వేస్తామని ఇంటియజమానులతో బహిరంగంగా చెప్పారన్నారు. ఈ విషయంపై విజయ రామాంజనేయులు, 17వ వార్డు సిపిఎం నాయకులు నాగరాజు, రమణ, బాధితులు వెంకటేశ్వర్లు, మద్ది మున్సిపల్ కమిషనర్‌కు పూర్తి వివరాలను తెలిపారు. కమిషనర్ వెంటనే అడిషనల్ కమిషనర్‌ను పిలిచి విచారణ చేసి సంబంధించిన వారి పైన చర్యలు తీసుకుంటామని, సేవల కోసం బాధితులు మున్సిపల్ అధికారులకు ఎవరూ లంచాలు ఇవ్వొద్దన్నారు. ఎవరైనా సచివాలయంలో సరిగా పని కాకపోతే మున్సిపల్ కార్యా లయంలో అప్లయ్ చేసు కోవచ్చుని హామీ ఇచ్చారు. కమిషనర్ సంబంధి .ంచిన అధికారులపై చర్యలు తీసు కోకపోతే ప్రజలను సమీకరించి అవినీతిపై పెద్ద ఎత్తున సిపిఎం పోరాటం చేస్తుందని హెచ్చరించారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు విజయరామాంజనేయులు

విద్యార్థిపై చెంపదెబ్బ

- జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో డిఇఒ విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

జీనియస్ గ్లోబల్ ప్రయివేట్ స్కూల్లో ఎల్‌కెజి చదువుతున్న ఆయాన్ చెంపపై డ్రైవర్ నరేష్ కొట్టడంతో ఫిర్యాదుతో డిఇఒ శ్యాముల్ పాల్, తహశీల్దార్ కె.రమాదేవి, ఎంఇఒలు మెయినుద్దీన్, రఘున్న విచారణ చేపట్టారు. బుధవారం జరిగిన ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక జీనియస్ గ్లోబల్ స్కూల్లో విచారణ జరిపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి బస్సులో నుంచి కిందికి దిగాలని ప్రయత్నించగా ఎంత ఒదార్చినా మొండికేసిన నేపథ్యంలో డ్రైవర్ నరేష్ తన కుమారుని చెంపపై కొట్టడంతో చెవి చాలా వచ్చిందని తండ్రి మహబూబ్ తెలిపారు. ఏమైనా జరగరాని సంఘటన జరిగితే డ్రైవర్‌దే బాధ్యత అని భావించి కొట్టినట్లు డ్రైవర్ చెప్పారన్నారు. ఈ విషయంలో తనను క్షమించాలంటూ డ్రైవర్ విన్నవించినట్లు తండ్రి పేర్కొన్నారు. డ్రైవర్ కొట్టడం ఏమిటని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించగా... డ్రైవర్‌ను విధుల నుంచి తొలగిస్తామని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్ర తెలిపారు. రంగంలోకి దిగిన డిఇఒ శ్యాముల్ పాల్ ఆయాన్ చెంపపై కొట్టిన డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎంఇఒకు ఆదేశాలు జారీ చేశారు. ప్రయివేట్ పాఠశాలలపై ఎంఇఒ పర్యవేక్షణ లేకపోవడం ఘటనకు కారణమని డిఇఒ తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు జీనియస్ గ్లోబల్ ప్రయివేట్ స్కూల్ దగ్గర ఉన్న డిఇఒను అడ్డుకున్నారు. అవినీతికి పాల్పడి ప్రయివేట్ పాఠశాలకు అండగా నిలిచిన ఎంఇఒ మెయినుద్దీన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తీసుకుంటామని డిఇఒ తెలిపారు. అనంతరం విద్యార్థి ఆయాన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.


చిన్నారిని పరామర్శిస్తున్న డిఇఒ శ్యాముల్ పాల్

12వ పిఆర్‌సి వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు 12వ పిఆర్‌సి వేతనాలు ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, జె.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. యూనియన్ కార్యదర్శి కె.ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వంలో 17 రోజుల సమ్మె ఒప్పందాలపై ప్రస్తుత ప్రభుత్వం జిఒలు విడుదల చేయడం లేదని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో చనిపోయిన 13 మంది కార్మిక కుటుంబాలకు ఎమ్మెల్యే హామీ మేరకు ఉపాధి చూపించాలని కోరారు. అనంతరం కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎ.సురేష్, బిబి.రాజు, యూనియన్ నాయకులు కె.ఖాజా, బి.కేసన్న, పల్లవి రాజు, కె.సల్మాన్, వీరేష్, తిక్కయ్య, గోరు బాష, రామాంజిని, యు.లక్ష్మన్న, డి.కేశన్న, మునీంద్ర, బి.సల్మాన్ పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - చిప్పగిరి

నేమకల్లు గ్రామంలో ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. సర్పంచి ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలన్న, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏకాంబరం సహకారంతో గ్రామంలోని ప్రజలకు, మహిళలకు సచివాలయం దగ్గర గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి, వారికి అవసరమైన మందులను అందజేశారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యాలు సరిగా లేని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ... మహిళలు ఇంట్లో ప్రతి వస్తువునూ శుభ్రతగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలు కూడా శుభ్రంగా ఉంటే మంచిదని చెప్పారు. తమ ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరాలను పలు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. వైద్యులు సింహాద్రి, ప్రీతి సుధన్, సరూహ సుమన్ రాజ్, సింధుజ పాల్గొన్నారు.



సర్పంచి, పంచాయతీ కార్యదర్శి బాలన్నతో వైద్యులు

నిలిచిన నాడు-నేడు పనులు

- కరివేములలో 8 ఏళ్లుగా రెండు గదులు, వరండాల్లో తరగతులు
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడు తున్నాయి. కరివేములలో నాడు నేడు పనులు నిలిచిపోయాయి. ఎనిమిదేళ్లుగా రెండు గదులు, వరండాల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థు లకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు...

దేవనకొండ మండలంలోని కరివేముల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యా బోధన 2017 సంవత్సరం నుంచి మండల పరిషత్తు పాఠశాలలోనే కొనసాగుతోంది. 6 నుంచి 10వ తరగతి వరకు 229 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేవలం 2 తరగతి గదులు, వరండాలలోనే విద్యార్థుల విద్యాబోధన ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. గదులు లేకపోవడంతో టాయిలెట్ దుర్వాసన మధ్యనే పాఠ్యాంశాలు బోధించే పరిస్థితి నెలకొంది. 2022 సంవత్సరంలో నాడు- నేడు పనుల కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. 80 శాతం మేరకు తరగతి గదుల నిర్మాణ పనులు జరిగాయి. గతేడాది నుంచి నిధుల కేటాయింపు నిలిచిపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. నాడు- నేడు పనులు నిలిచిపోవడంతో స్కూల్ తరగతి గదుల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో ప్రాథమిక పాఠశాల భవనంలోనే అరకొర వసతుల మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటస్థలం లేకపోవడంతో మానసికంగా, శారీరకంగా ఉపయోగపడే ఆటలు లేక విద్యార్థులు క్రీడల్లో వెనుకంజలో ఉన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాలక ప్రభుత్వ ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హైస్కూల్ తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వరండాలోనే తరగదులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలి


- బడే సాబ్, గ్రామ పెద్ద



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తరగతి గదులు మండల పరిషత్ పాఠశాలలోనే నిర్వహిస్తుండడంతో విద్యార్థుల సంఖ్యకు తగ్గ తరగతి గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గదులు లేక వరండాల్లోనే టాయిలెట్ దుర్వాసన మధ్య పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు బోధించే పరిస్థితి నెలకొంది.

నిధులు కేటాయించాలి

- శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు



కరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదుల నిర్మాణ నాడు- నేడు పనులు నిలిచి ఏడాది అవుతుందని, ఆ పనులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. 80 శాతం మేరకు పనులు జరిగాయని మిగిలిన పనులు పూర్తి అవుతే విద్యార్థులకు ఉపాధ్యాయులకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కలిగి ఇబ్బందులు తొలగిపోతాయి.

శ్రీమఠంలో సంగీత దర్శకులు కీరవాణి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని సినీ సంగీత దర్శకులు, గాయకులు ఎంఎం.కీరవాణి కుటుంబ సభ్యులు, కల్యాణి మాలిక్, నటులు కాంచితో కలిసి గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి కుర్డీ శ్రీపాదాచార్, సిఐ రామాంజులు, పోలీసు సిబ్బందితో భద్రత కల్పించి స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం, జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు. రఘువీరా, మోహన్, శ్రీచైతన్య, శివ కంరణ ప్రియ, సప్తమి, చౌదరి, వెంకటేష్, మయూరి, మంగళగౌరీ, విజయరాఘవన్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్ రంగస్వామి ఉన్నారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న కీరవాణి

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. స్వామివారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా శ్రీమఠం అధికారులు దర్శనం, భోజన సదుపాయం కల్పించారు.

తాగునీరు కూడా ఇవ్వలేరా..?

- ఇంటి నుంచే పాఠశాలకు నీటిని తెచ్చుకుంటున్న విద్యార్థులు
- నిరుపయోగంగా మారిన ఫిల్టర్ వాటర్ మిషన్లు
- వాటిని పట్టించుకునే వారే లేరు..!

ప్రజాశక్తి - చిప్పగిరి

పాఠశాలలో విద్యార్థులకు కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు రోజూ ఇంటి నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో ఉన్న ఫిల్టర్ వాటర్ మిషన్లు మరమ్మతులకు గురయి మూలనపడ్డాయి. వాటి గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 570 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 325 మంది విద్యార్థులు మాత్రమే భోజనాలకు హాజరవుతున్నారని, స్వయాన పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులే చెబుతున్నారు. మిగతా 245 మంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనాల తీసుకొస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులను పలు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలలో శుద్ధజల కేంద్రాలను పెట్టి ఫిల్టర్ వాటర్ మిషన్ ఏర్పాటు చేయించాయి. పలు పాఠశాలల్లో ఫిల్టర్ మిషన్ చెడిపోవడంతో వాటికి మరమ్మతులు కూడా చేయించలేని దౌర్భాగ్య స్థితిలో అధికారులు ఉన్నారు. కొన్ని పాఠశాలల్లో భోజనం తినే ప్లేట్లు కడుక్కోవడానికి, చేతులు కడుక్కోవడానికి ఉండే ఉప్పు నీరు కూడా కొన్నిసార్లు అందుబాటు లేకుండా పోతున్నాయి. కొన్ని సందర్భాల్లో అన్నం తిన్న ప్లేట్లను ఇంటి దగ్గర కడుక్కోవచ్చని బ్యాగులోనే తీసుకెళ్తున్న విద్యార్థులు కూడా ఉన్నారు. పుస్తకాల బరువుతో పాటు వాటర్ బాటిళ్లను తీసుకొస్తున్నారు. మండలంలోని ప్రతి పాఠశాలలోనూ ఫిల్టర్ వాటర్ కేంద్రాలు ఉన్నాయి. వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి ఒకరిని నియమించి వారి ద్వారా ఫిల్టర్ మిషన్‌కు మరమ్మతులు చేసేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పేరుకే మండల కేంద్రంలో పాఠశాల ఉంది. ఇప్పటివరకు పాఠశాలకు ప్రహరీ లేదు. ముళ్ల పొదల్లో నుంచి ఏ విష సర్పాలు వచ్చినా దిక్కు లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే ప్రహరీ, ఫిల్టర్ మిషన్‌కు మరమ్మతులు చేసి విద్యార్థులకు తాగునీటిని అందుబాటులోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరి ముళ్లచెట్లలో ఉన్న ప్రహరీ

ఇంటి నుంచే వాటర్ బాటిల్ తీసుకొస్తున్నాం

- దివ్య, 8వ తరగతి విద్యార్థి



మా చిప్పగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీరు చాలా ఇబ్బందిగా ఉంది. ఒక్కోసారి చేతులు, ప్లేట్లు కడుక్కోవడానికి ఉప్పు నీరు కూడా ఉండదు. భోజనం చేసేందుకు ఇంటి నుంచి వాటర్ బాటిల్ తీసుకొస్తున్నాం.

తాగునీరు ఇక్కడే ఉంటే బాగుంటుంది

- అక్బర్ వలీ, 6వ తరగతి విద్యార్థి



రోజూ ఇంటి నుంచి పుస్తకాలతో పాటు వాటర్ బాటిల్ కూడా తీసుకురావాలంటే చాలా బరువుగా ఉంది. పాఠశాలలోనే తాగడానికి నీరు ఉంటే మేము ఇంటి నుంచి వాటర్ బాటిల్ తీసుకురాకుండా ఉంటాం. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విషసర్పాలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - కౌతాళం

పోలీసు స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం ఫ్యాక్షన్ గ్రామమైన గౌడూరులో గ్రామస్తులతో మాట్లాడారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడరాదని తగిన సూచనలు చేశారు. గ్రామాల్లో స్నేహభావంతో ఉండి, పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలన్నారు. గ్రామంలో విద్యావంతులైతే సమస్యలు రావని పేర్కొన్నారు. సిఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

హైవేలో దోపిడీకి పాల్పడుతున్న షికారి గ్యాంగ్ అరెస్టు


మాట్లాడుతున్న సిఐ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

జాతీయ రహదారి (హైవే)లో ఆగి ఉన్న లారీ డ్రైవర్లపై దాడి చేసి దోపిడీకి పాల్పడుతున్న షికారి గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్లు సిఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మహబూబ్ బాష తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. ఈనెల 5న ఆలూరు అతిథి హోటల్ వద్ద ఆగి ఉన్న లారీలో నిద్రిస్తున్న డ్రైవర్ సెల్, డబ్బులు తీసుకొంటుండగా డ్రైవర్ ప్రతిఘటించగా దుండగులు డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యారని తెలిపారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా బసరకోడు గ్రామం మూర్తి, గదక్ జిల్లా చిక్కవద్దెత్తి గ్రామానికి చెందిన షికారి పరమేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని సంజీవయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆ ప్రదేశాన్ని సందర్శించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

'సజ్జ పంటను మేపిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి'

ప్రజాశక్తి - కోసిగి

సజ్జ పంటను మేపిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని రైతు కె.వీరేష్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. గ్రామంలోని సర్వే నెంబర్ 139, 140లో 70 సెంట్ల భూమి తమ తండ్రి వారసత్వంగా వచ్చిందని తెలిపారు. ఈ భూమిని గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఈఏడాది సజ్జ పంట సాగు చేసినట్లు తెలిపారు. పొలంలో ఎవరూ లేని సమయం చూసి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చింతకుంట శ్రీరాములు తమ పొలాన్ని గొర్రెలతో మేపారని, పంట కోసం పెట్టిన పెట్టుబడి నష్టపోయామని వాపోయారు. పొలంలో సజ్జ పంట మేపిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.




మెడికల్ కళాశాలను పూర్తి చేస్తాం

- కూటమి నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పిపిపి పద్ధతిలో ఆదోని మెడికల్ కళాశాలను పూర్తి చేసి ఆదోని ప్రజలకు అంకితం చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. గురువారం ఆదోని ఆరెకల్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను కూటమి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు భూపాల్ చౌదరి మాట్లాడారు. గత వైసిపి హయాంలో ఆగిపోయిన పనులను కూటమి ప్రభుత్వం బాధ్యతగా ప్రారంభించిందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు, పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. వైసిపి రాజకీయ లాభం కోసమే ప్రయివేటీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప మాట్లాడుతూ... మెడికల్ కళాశాలల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వాడి వైసిపి ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు పైగా రుణం తీసుకుందని, నిర్మాణ పనులను గాలికి వదిలేసిందని విమర్శించారు. విట్టా రమేష్, టిడిపి నాయకులు మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, బసాపురం రామస్వామి, లక్ష్మీనారాయణ, రవి శంకర్ స్వామి, ప్రతాపరెడ్డి, వీరేంద్ర, సాధికా బేగం, జనసేన నాయకులు రేణు వర్మ, పులి రాజు, తాహెర్ వలీ, శీనా రాజశేఖర్, నాయకులు నాగరాజు గౌడ్, ఉపేంద్ర, కౌన్సిలర్ లలితమ్మ, మధుసూదన్ శర్మ, కునిగిరి నీలకంఠ, ఉషారాజ్, వినీత గుప్తా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూపాల్ చౌదరి


బాధ్యతలు తీసుకుంటున్న బీటీ

ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా బీటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆదోని

ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ.నాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీలోని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు ఆధ్వర్యంలో ప్రివిలేజ్ కమిటీ కొత్తగా ఏర్పాటయింది. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీకి ఎమ్మెల్సీ బీటీ.నాయుడు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులు జయేంద్ర భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పందుల రవీంద్ర బాబు, రఘురాం తలసీల, రాజగోళ్ల రమేష్ యాదవ్ ఉన్నారు. బీటీ.నాయుడు మాట్లాడుతూ... సభ్యుల హక్కులను కాపాడే దిశగా ఈ కమిటీ పనిచేస్తుందని, సభ్యుల గౌరవం నిలబెట్టేలా కృషి చేస్తామని తెలిపారు.

'ఎమ్మెల్యే బీవీ కృషితో సాగునీరు'

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి కృషితో రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని టిడిపి నాయకులు రైస్‌మిల్ నారాయణరెడ్డి తెలిపారు. నందవరం మండలం హాలహర్వి గ్రామంలోని దేశాయి చెరువును రైస్ మిల్ నారాయణరెడ్డి, చిన్న కొత్తిలి డిస్ట్రిబ్యూటర్ ఛైర్మన్ ఎన్.గోవర్ధన్ రెడ్డి, టిడిపి మండల కార్యదర్శి ప్రభుదాస్, ఎల్ఎల్‌సి ఎఇ, డిఇ, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, టిడిపి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటర్ కాలువ నుంచి దేశాయి చెరువు వరకు కాలువ పూడికతీత, పటిష్టత కోసం గ్రావెల్ రూ.6.75 లక్షలు, చెరువు తూము నిర్మాణానికి రూ.6.90 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. పనులు కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. నిధులు మంజూరు చేయించి చెరువు అభివృద్ధికి తోడ్పడిన ఎమ్మెల్యే బీవీకి రుణపడి ఉంటామని తెలిపారు. టిడిపి నాయకులు బోయ నాగరాజు, జగన్నాథ్ రెడ్డి, బోయ ఎర్రం నాయుడు, దావీదు, మణికుమార్, జి.ఏసేపు, బోయ బుడ్డ రంగన్న పాల్గొన్నారు.


దేశాయ్ చెరువును సందర్శిస్తున్న నాయకులు

'రెడ్డి' కార్పొరేషన్‌పై గళం విప్పిన బీవీకి కృతజ్ఞతలు

- రెడ్డి సంఘం మండల నాయకులు

ప్రజాశక్తి - నందవరం

రెడ్డి సామాజికవర్గానికి కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి అసెంబ్లీలో గళం విప్పడం అభినందనీయమని రెడ్డి సంఘం మండల నాయకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలు, అన్ని కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని తెలిపారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పేద కుటుంబాలకు నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే బీవీ అసెంబ్లీలో కోరడం సంతోషకరమన్నారు. రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.నారాయణరెడ్డి, జొహరాపురం తిప్పారెడ్డి, హాలహర్వి జగన్నాథ్ రెడ్డి, రాయచోటి రామకృష్ణా రెడ్డి, చిన్నకొత్తిలి సత్యారెడ్డి, గురజాల రాజేశ్వర్ రెడ్డి, నందవరం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

'పిపిపి'పై నేడు నిరసన

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టే 'చలో మెడికల్ కళాశాల'ను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. ప్రజల భవిష్యత్తును, పేద విద్యార్థుల చదువును కాపాడే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. వైసిపి నాయకులు రాంపూర్ ఇదాయత్, సన్నీ, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, యువజన విభాగం అధ్యక్షులు ఆసిఫ్, నల్లారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏసోబు, ఆరెకల్ రాముడు, సాంబ, భీమా పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ దుర్మార్గం

- నేటి 'చలో వైద్య కళాశాల'ను జయప్రదం చేయండి : వైసిపి



గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలను తీసుకొస్తే వాటిని ప్రయివేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని వైసిపి జిల్లా కార్యదర్శి బిపి.కర్రెప్ప విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటీకరిస్తే సామాన్యులకు వైద్యం దూరం అవుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరిస్తున్నారని విమర్శించారు. ఈనెల 19న జరిగే 'చలో ఆదోని మెడికల్ కళాశాల'కు జిల్లాలోని ఏడు నియోజవర్గాలకు చెందిన వైసిపి యువజన విభాగం సభ్యులు, విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'మెడికల్ కళాశాల'పై చేతులెత్తేస్తున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మెడికల్ కళాశాలను పూర్తి చేయకుండా ప్రయివేట్‌కు అప్పజెప్పి ప్రభుత్వం చేతులెత్తేస్తోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు దిలీప్ దొక, పట్టణ అధ్యక్షులు సాయినాథ్ మాట్లాడారు. పిపిపి అంటే బిజెపి, టిడిపి, జనసేన అని, ఈ మూడు 'పి'లు కలిసి కూటమిగా ప్రజలను మోసం చేయడానికే కంకణం కట్టుకున్నాయని విమర్శించారు. వైద్య కళాశాల నిర్మించడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాక చేతులెత్తేస్తున్నామని చెప్పడానికే భూపాల్ చౌదరి మీడియా ముందు కొచ్చినట్టుందని ఎద్దేవాచేశారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించే పార్టీ జనసేన అని అంటున్న మల్లప్ప ఇప్పటి వరకు ఏం చేశారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పే పద్ధతిని మానుకోవాలని హితవు పలికారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు శ్రీనిథ్ రాయల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం

- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పాఠశాల వాట్సాప్ గ్రూపులో బుధవారం రాత్రి ఒకరిపైఒకరు కామెంట్ చేసుకోవడంతో ఇద్దరి మధ్య వివాదం.. రెండు యూనియన్ల మధ్య సమస్యగా మారింది. ఉదయమే ఉపాధ్యాయ సంఘం నాయకుని తీసుకుని పక్కనే ఉన్న పాఠశాలకు వచ్చారు. అర్ధరాత్రి వేళ అసభ్యకరమైన కామెంట్లు పెట్టడం, కించపరిచే విధంగా మాట్లాడడం ఏమిటని కామెంట్ పెట్టిన ఉపాధ్యాయుని ప్రశ్నించారు. ఇరువురి మధ్య మాటా మాట పెరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకునే వరకు చేరింది. పక్కనే ఉన్న ఉపాధ్యాయులు ఇరువురికి సర్ది చెప్పి పంపారు. రాత్రివేళ వాయిస్ మెసేజ్ పెట్టి భయాందోళనకు గురి చేస్తున్నారని ఒక వర్గం వాదించగా... పొరపాటు జరిగిందని, మరోమారు ఇలా జరగకుండా జాగ్రత్త తీసుకుంటామని మెసేజ్ పంపిన ఉపాధ్యాయుడు బదులిచ్చారు. ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు సుధాకర్... ఈ సమస్యపై హెచ్ఎం వచ్చాక మాట్లాడదామని, డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ దృష్టి కూడా తీసుకెళ్తానని తెలిపారు. అంతటితో ఆగకుండా ఇప్పటికే రెండు సార్లు తమను వాయిస్ మెసేజ్ ద్వారా కించపరిచేలా మాట్లాడారని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి గురువారం ఉపాధ్యాయునిపై ఫిర్యాదు చేశారు. తనను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మెసేజ్ పంపిన ఉపాధ్యాయుడు కూడా ఫిర్యాదు చేయడంతో వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. సిఐ రాజశేఖర్ రెడ్డి ఎంఇఒ-2 శ్రీనివాసులు, ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌ను, ఉపాధ్యాయుని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. రాత్రి వాట్సాప్ గ్రూపులో అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై డిప్యూటీ డిఇఒ వెంకటరమణతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారిస్తామని సిఐకి తెలపడంతో రాతపూర్వకంగా రాసిచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. సిఐ రాజశేఖర్ రెడ్డిని వివరణ కోరగా డిప్యూటీ డిఇఒతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

రచ్చుమర్రిలో రాష్ట్రీయ పోషణ మాసం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి అంగన్వాడీ కేంద్రంలో 'రాష్ట్రీయ పోషణ మాసం'ను ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమిత్రా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాల్య దశలో పోషణ, సంరక్షణ, విద్య, స్థూలకాయం వంటి అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఎఎన్ఎం శాంతి కుమారి, ఎంఎల్‌హెచ్ శారద, వినోద్, అంగన్వాడీ వర్కర్లు అంజినమ్మ, మీనాక్షి, భారతి, నాగవేణి, లావణ్య, ఆశావర్కర్లు రాజ్యలక్ష్మి, శివలింగమ్మ, శారద పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: KURNOOL
E.P.NO.381 OF 2022
IN O.S.NO.1246 OF 2021

BETWEEN:
V.MADHU. ...D.Hr
VS
C.Ashok Kumar. S/o Sadhu, Hindu, Goldsmith, Shop No.18, Up Stairs, S.V.C.Shroff Bazar, Kurnool. ...J.Dr

C.P.C.O-21 R-54 (1) ప్రకారం JDr కు నోటీసులు

పై నెంబర్ E.P లో D.Hr, J.Dr పైన పొందిన డిక్రిని అమలు జరుపుతూ J.Dr తాలుకు షెడ్యూల్ ఆస్థిని జప్తి చేయమని అమలు అర్జి దాఖలు చేసినాడు. ఇందుపైన J.Dr అయిన నీకు ఆక్షేపణ ఉన్న 23-10-2025వ తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు :
House constructed in vacant plot No.36 in Sy.No.156 at Panchalingala Village, Kurnool Mandal, Kurnool District laid by Skandha Infra Projects, Kurnool under the name and style of Skhandhansi Gardernia, A-Block, Panchalingala Village, Kurnool Mandal, Kurnool District, which is within the Sub-Registration Office of Kurnool and Registration District of Kurnool with the following boundaries:
East:33 feet Road
West: Plot No.9
North: Plot No.35
South: Plot No.37.
Measurements:
East-West: 40 feet
North-South: 30 feet
total extent: 1200 Sq.ft = 133.33 Sq. Yards.
approximate market value of the Property: Rs.30,00,000/-

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 23-10-2025

పి. జగదీష్‌బాబు,
D.Hr పరం అడ్వకేటు, కర్నూలు.

రెండేళ్ల చిన్నారిని కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల5న గద్వాలకు చెందిన మహేష్, జ్యోతి దంపతుల రెండేళ్ల కుమార్తె బేబీ గర్ల్ శివ రాణి ఇంట్లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరింది. రోగి తండ్రి శస్త్రచికిత్సకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో వెళ్ళిపోతుండగా చిన్నారి పరిస్థితి చూసి డాక్టర్ తన సొంత ఖర్చులతో ఆపరేషన్ చేసారు. బాలిక ఇంట్లో మెట్ల పక్కన టవల్‌తో ఆడుకుంటుండగా టవల్ ఆమెకు తగిలి మెట్లపై నుండి కిందపడింది. కిందపడినప్పుడు చిన్నారి తలకు రాయి తగలడంతో తీవ్ర వాంతులు అవ్వడంతో ఆమె తల్లిదండ్రులు వెంటనే గద్వాల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితిని నిలకడగా ఉంచడానికి గ్లూకోజ్ ఎక్కించారు. అనంతరం సిటీ స్కాన్ తీశారు.

ఈ స్కానింగ్‌లో చిన్నారి మెదడులో పెద్ద రక్తం గడ్డకట్టినట్లు గుర్తించారు. దీనికి తక్షణమే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. సకాలంలో శస్త్రచికిత్స చేయకపోతే ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు చెప్పారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. రాత్రి పదకొండు గంటలకు మెడికవర్ ఆసుపత్రికి చేరుకున్నారు. వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తరలించి అడ్మిట్ చేసుకున్నారు. డాక్టర్ విశ్వ కుమార్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ రిపోర్ట్లను పరిశీలించి వెంటనే ఆపరేషన్ థియేటర్ కు షిఫ్ట్ చేసారు. క్లిష్టమైన వైద్య పరిస్థితిలో అతి తక్కువ ఖర్చుతో, గద్వాలకు చెందిన రెండేళ్ల చిన్నారి బ్రెయిన్ సర్జరీ విజయవంతంగా పూర్తయ్యింది. మెదడులో పెద్దగా గడ్డకట్టిన రక్తాన్ని తొలగించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్స్‌లో నిపుణులైన వైద్య బృందం నిర్వహించింది. ఆపరేషన్ విజయవంతం అయిన తర్వాత, చిన్నారి కోలుకోవడానికి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు మార్చారు. డాక్టర్ సింధూర రెడ్డి, కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, నియోనాటాలజిస్ట్, ఆపరేషన్ తర్వాత చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం చిన్నారి పూర్తిగా కోలుకుంటోంది. గురువారం డిశ్చార్జ్ చేశారు.అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై. మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ విశ్వ కుమార్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ మాట్లాడుతూ తలకు ఎలాంటి గాయం అయినా దాని తీవ్రతతో సంబంధం లేకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. ప్రతిసారీ కిందపడినప్పుడు రక్తం గడ్డకట్టకపోయినా, ఎలాంటి సమస్యలు రాకుండా ఉండటానికి సకాలంలో వైద్య సంప్రదింపులు తప్పనిసరి అని సూచించారు. మావద్ద అనుభవజ్ఞులైన వైద్యులచే చికిత్స అందిస్తూ సరైన సమయంలో సరైన వైద్యం, అత్యాధునిక సదుపాయాలతో మన మెడికవర్ హాస్పిటల్స్ 24/7 అందుబాటులో ఉంటుంది.



కాపాడిన చిన్నారితో వైద్యులు

నగరపాలకలో 'స్తన్యపాన గది' ఏర్పాటుకు చర్యలు



ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చే మహిళలు తమ శిశువులకు పాలు పట్టించుకునే సౌకర్యం లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం నగరపాలక సంస్థ దృష్టికి రావడంతో, ప్రత్యేకంగా స్తన్యపాన గది ఏర్పాటుకు కమిషనర్ పి.విశ్వనాథ్ చర్యలు చేపట్టారు. గురువారం ఆయన స్వయంగా గదిని పరిశీలించి, అవసరమైన పనులను తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తల్లి పాలే శిశువుకు ప్రథమ ఔషధమని, శిశువు ఆరోగ్యానికి, మానసిక వికాసానికి తల్లి పాలకన్నా మించినది లేదన్నారు. వివిధ పనుల కోసం నగరపాలక కార్యాలయానికి వచ్చే తల్లులు తమ శిశువులకు పాలు పట్టించుకునే సౌకర్యవంతమైన గది లేకపోవడంతో, వారు పబ్లిక్ ప్రదేశాల్లో ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని తన దృష్టికి వచ్చిందని, వెంటనే ప్రత్యేక గది ఏర్పాటుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. గదిలో తల్లులకు కావలసిన అన్ని సదుపాయాలు కల్పించనున్నామని, కర్టెన్లు, స్ప్రింగ్ డోర్లు, సౌకర్యవంతమైన ఫర్నిచర్, ఫ్యాన్, సరిపడా వెలుతురు (లైటింగ్) వంటి సౌకర్యాలతో పాటు, తల్లులు ఇబ్బందిపడకుండా పూర్తిగా సురక్షితమైన వాతావరణం కల్పిస్తామని స్పష్టం చేశారు. మేనేజర్ చిన్నరాముడు, డిఇఇ గిరిరాజ్, ఎఇ ఖాసిం వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికులకు మొక్కలు పంపిణీ

ఆసక్తిగల వారు సచివాలయాల్లో వివరాలు నమోదు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'హరిత ఆంధ్ర' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటి మేడపై, అపార్టుమెంట్ల బాల్కనీలలో మొక్కలు, పండ్ల చెట్లు, కూరగాయలు పెంచే వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ వివరాలను సంబంధిత సచివాలయ పరిధిలోని శానిటేషన్ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదైన తోటలను శానిటేషన్ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పరిశీలించి ఉత్తమమైన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు.ఈ నెల 20న నగరపాలక సంస్థ కార్యాలయం మరియు 16 శానిటేషన్ డివిజన్లలో పచ్చ సుంకేసుల,పెల్టోఫోరం, గుల్మోహర్,ఎర్ర సుంకేసుల, కొండతంగేడు, గంగరావి, సీతాఫలం, తపస్సి, కానుగ, జామ, వేప వంటి తొమ్మిది రకాల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గృహం, కార్యాలయం, పాఠశాల, హాస్టల్ ఒక తోటగా మారితే, కర్నూలు నిజమైన స్వచ్ఛ హరిత నగరంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ సంస్థలు తమ పరిసరాలను హరిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్య సాధనలో స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కమిషనర్ కోరారు .

రిడ్జ్‌లో ఘనంగా దసరా ఉత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగర శివార్లలోని లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో దసరా ముందస్తు వేడుకలను గురువారం జరిగాయి. పాఠశాల ఆవరణ పూలతో, రంగురంగుల అలంకరణలతో కళకళలాడగా, విద్యార్థులు , ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. విద్యార్థులు పాటలు, నత్యాలు, రూపకాలు ప్రదర్శించి ఉత్సవం ప్రత్యేకతను ప్రతిబింబించారు. పాఠశాల సిఇఓ గోపీనాథ్, కో–సిఇఓ సౌమ్య గోపీనాథ్ , డీన్ రాజేంద్రన్ ప్రిన్సిపల్ రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి తేలుకాటు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ప్రాథమిక పాఠశాలలో గురువారం ఐదవ తరగతి చదువుతున్న వర్షిత తేలుకాటుకు గురైంది. వెంటనే ప్రధానోపాధ్యాయులు పద్మావతి విద్యార్థినిని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. విద్యార్థి తల్లి మాట్లాడుతూ పాఠశాల శిథిలా వ్యవస్థకు చేరిందని అపరిశుభ్రతతో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వర్షం వస్తే విద్యార్థులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్యార్థులను కాపాడాలని కోరారు.

ఆరోగ్యవంతమైన పిల్లలతోనే దేశ భవిష్యత్తు

కెఎంసి నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి శ్యామల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆరోగ్యవంతమైన పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాది అని 'స్వస్థనారీ–స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజ్ నోడల్ ఆఫీసర్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల అన్నారు. గురువారం కర్నూలు సర్వజన ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం లో 'స్వస్థనారీ–శక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం రెండో రోజులో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తల్లులకు సూచన చేస్తూ ప్రభుత్వం వేల రూపాయల విలువైన 11రకాల టీకాలను అందిస్తున్నదని దీని ద్వారా 12 రకాల వ్యాధులకు నుంచి పిల్లలకు రక్షణ కలుగుతుందన్నారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తద్వారా పిల్లలు ఆ వ్యాధుల బారిన పడకుండా కాపాడబడతారని తెలిపారు. ప్రతి తల్లి టీకా కోసం పిల్లలని తీసుకెళ్లినప్పుడు విధిగా ఇమ్యునైజేషన్ కార్డు తీసుకెళ్లాలని షెడ్యూల్ ప్రకారం టీకా వేయించు కుంటేనే పూర్తి ఫలితాలు ఉంటాయని తల్లులకు తెలిపారు. టీకాల వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ కలుగుతుందని టీకాల వల్లనే పోలియో, మశూచి, ధనుర్వాతం వంటి వ్యాధులను చాలావరకు నివారించగలిగామని, ప్రతి తల్లి తమ పిల్లలకు టీకాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా విధిగా టీకాలు వేయించాలని కోరారు. పీడియాట్రిక్ విభాగపు ప్రొఫెసర్లు డాక్టర్ సుహాసిని, డాక్టర్ శారద అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీలత , డాక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎంసి నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి శ్యామల

అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బేతంచెర్ల

అంగన్వాడీ కేంద్రాల సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ అన్నారు. బేతంచర్లలోని ఎన్జీవోస్ కాలనీలో గల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నందు పోషక ఆహార మహోత్సవాల కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, శ్రీదేవి, రమణమ్మ, రాధాదేవి, రమాదేవి, లక్ష్మీదేవి, మేరీ, రాజేశ్వరి, అరుణ, కళావతి, రాధమ్మ, మల్లేశ్వరి రామ తులసి, బి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ తాలూకాలోని మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర వైసిపి ప్రధాన కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 15 రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్న చేతికొచ్చే సమయానికి వర్షం పడడంతో పంటకు తెగులు రావడం జరిగిందన్నారు. కోత కోసిన పంటను రోడ్లమీద ఆరపోసుకున్న వారి పరిస్థితి వర్షం రాకతో దైన్యంగా మారిందన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకొని రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో ఉల్లిగడ్డ, టమోటా రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నట్లే మొక్కజొన్న రైతుల పరిస్థితులు కూడా అలాగే ఉన్నాయన్నారు. ఇప్పటికే సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు పట్టణంలో ఏర్పాటు చేసిన లారీ అసోసియేషన్‌తో మరో సమస్య ఎదురైందన్నారు. చెన్నై నుంచి వచ్చిన లారీలలో ఎగుమతి చేస్తే రైతులతో క్వింటాకు ఇంత అని వసూలు చేస్తున్నారని ఆరోపించారు. లారీ అసోసియేషన్‌కు రైతులు ఎందుకు డబ్బు కట్టాలని ప్రశ్నించారు. ఎవరి ప్రోద్బలంతో లారీ అసోసియేషన్‌లో ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా కొత్త దందాలు ఆపాలని రైతులకు, వ్యాపారస్తులకు నష్టం చేసే చర్యలను ప్రోత్సహించవద్దన్నారు.

నేడు వెల్దుర్తిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

హాజరుకానున్న జెసి, ఆర్‌డిఓ

ప్రజాశక్తి - వెల్దుర్తి

నేడు వెల్దుర్తిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నవ్య, ఆడిఓ సందీప్ కుమార్ హాజరవుతారని మండల తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో జరుగుతుందని మండల ప్రజలు పాల్గొని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు, అర్జీలను ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.